కల్వర్టుపై దిమ్మెల ఏర్పాటు

'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

నవాబుపేట, మే 24 : మండల పరిధిలోని మాదారం నుంచి మీనపల్లి కలాన్, కద్పూర్ల వెళ్లే మార్గంలో అసంపూర్తిగా ఉన్న కల్వర్టుపై దిమ్మెలు ఏర్పాటు చేశారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో మార్చి 19న వచ్చిన అసంపూర్తిగా కల్వర్టు నిర్మాణ పనులు అనే కథనానికి అధికారులు స్పందించి దిమ్మెలు ఏర్పాటు చేశారు. దీంతో రైతులు, వాహనదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తవ్వారు..వదిలేశారు..

మర్పల్లి, మే 24 : మండల కేంద్రంతో పాటు పట్లూర్ తదితర గ్రామాలకు వెళ్లే రోడ్ల పక్కన కేబుల్ వేసేందుకు గుంతలను తవ్వి అలాగే వదిలేశారు. దీంతో ఆ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఎప్పుడు ఏ ప్ర మాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నా రు. రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ గురుకులాల్లో ఇంటర్‌కు దరఖాస్తులు

పరిగి, మే 24: ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పరిగి గురుకులం ప్రిన్సిపాల్ బి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24 నుంచి 31వ తేదీ వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఒకేషనల్ కోర్సులలో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుము రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొంరాస్‌పేట, మే 24 : బొంరాస్‌పేట 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మత్తుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ఏర్పుమళ్ల, తుంకిమెట్ల, బొంరాస్‌పేట, మెట్లకుంట, బొట్లవానితండా, దేవులానాయక్‌తండా, భోజన్నగడ్డతండా, మైసమ్మగడ్డతండా, గాజులకుంటతండా, కంకర మిషన్లకు శనివారం ఉదయం 7.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ నాగరాజు కోరారు.

గురుకులాలకు విద్యార్థుల ఎంపిక

కొడంగల్, మే 24: తెలంగాణ గురుకుల సెట్ ప్రవేశ పరీక్షలో శ్రీహరి, ఆదిత్య, సాయివరుణ్‌లు అర్హత సాధిండంతో శుక్రవారం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా మున్సి పల్ పరిధిలోని పాతకొడంగల్ గ్రామ మండల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ తెలంగాణ గురుకుల ప్రవేశ పరీక్ష 2వ ఫేస్‌లో పాఠశాలకు చెందిన శ్రీహరి, మేడ్చల్‌జిల్లా ఉప్పల్ బీసీ వెల్ఫేర్ పాఠశాలకు, ఆదిత్యప్రసాద్, సాయివరుణ్‌లు తాండూర్ మైనారిటీ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

తాండూరు రూరల్, మే 24: తాండూరు మండల పరిధిలో అధికారులు సీజ్ చేసిన ఇసుకను శుక్రవారం వేలం వేశారు. తహసీల్దార్ తారా సాంగ్, ఆర్ఐ బాల్‌రాజ్ ఆధ్వర్యంలో 101 ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయగా గోపాల్‌రెడ్డి రూ.2 లక్షల 40 వేలకు దక్కిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్, మే 24 : పండ్ల తోటల పెంపకానికి నీటి వసతి కలిగిన చిన్న, సన్న కారు రైతుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉపాధి హామీ ఏపీవో శారద శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను స్థానిక పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శి లేదా ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేయలన్నారు. జాబ్‌కార్డు కలిగి ఉండి 1 నుంచి 5 ఎకరాల్లోపు చిన్న, సన్న కారు రైతులు పండ్ల తోటల పెంపకం రాయితీ పొందేందుకు అర్హులన్నారు. మామిడి, బత్తాయి, సపోట, నిమ్మ, అయిల్ పామ్, సీతాఫల్, దానిమ్మ, మునగ తదితర తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి

దోమ/ యాలాల మే 24: పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. మోత్కూర్ ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జనుము,జీనుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జనుము 40 కిలోల బస్తా ధర రూ. 1460, జీలుగ 30 కిలోల బస్తా ధర రూ.1130 ఉందని తెలిపారు. అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం,ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకొచ్చి ఏఈవోల దగ్గర పర్మిట్ తీసుకొని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. పచ్చి రొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలను ప్రైమరీ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా 60 శాతం రాయితీపై అందిస్తున్నామని యాలాల మండల వ్యవసాయాధికారి యాదగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఇరువురు కాంగ్రెస్ నాయకుల సస్పెన్షన్

బషీరాబాద్, మే 24 : పార్టీ వ్యతిరేక కార్యకాలాపాలు పాల్పడుతున్న ఇద్దరూ కాంగ్రెస్ నాయకులను సస్పెండ్ చేస్తూ జిల్లా అధ్యక్షుడు రామ్మో హన్‌రెడ్డి శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డే శ్రీనివాస్, బషీరాబాద్ మండలం కొర్విచేడ్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ను సస్పెండ్ చేశారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కులకచర్ల, మే 24 :మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర కళాశాలలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభ మయ్యాయి. ఉదయం నిర్వహించిన ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షలో 47 మంది విద్యార్థులకుగాను ఒకరు హాజరు కాలేదు. ఒకేషనల్‌లో 11మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం తెలుగులో 25మందికి గాను ముగ్గురు హాజరుకాలేదు. ఒకేషనల్‌లో ఒకరు ఉండగా గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ కామేశ్వరీ తెలిపారు.

పెద్దేముల్: పెద్దేముల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో మొత్తం 26 మంది విద్యార్థులకు గాను 24 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. సెకండియర్‌లో మొత్తం 14 మంది విద్యార్థులకు గాను 14 మంది హాజరయ్యారు.

డ్రగ్స్ చాక్లెట్ల విక్రయదారులపై నిఘా పెట్టాలి

■ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ■ మండల సమావేశంలో పలు అంశాలపై చర్చ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, మే 24: డ్రగ్స్ చాక్లెట్ల విక్రయదారులపై ప్రత్యేక నిఘాపెట్టాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఎంపీపీ మల్లేశం ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నియోజక వర్గంలోని పాఠశాలల వద్ద ఐస్ క్రీమ్ వ్యాపారులు కొందరు పిల్లలకు చాక్లెట్లలో డ్రగ్స్ గంజాయి కలిపి విక్రయిస్తునట్లు తెలిసిందని వారిపై పోలీసులు, ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రత్యేక నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీరు, విద్యుత్, రోడ్లు, మురుగు కాల్వల సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులు నివేదికలను ఇవ్వాలని సూచించారు. మండల పరిధిలో నిలిచిపోయిన రోడ్లు, పాఠశాల భవనాల వివరాలు ఇవ్వాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను డ్వాక్రా సంఘాల మహిళలతో ఏర్పాట్లు చేసి పాఠశాలల్లో ప్రభుత్వం మంజూరు చేసిన పనులను పూర్తి చేయించాలని పేర్కొన్నారు. అసంపూర్తిగా ఉన్న రోడ్ల పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేయాలని తెలిపారు. ప్రభుత్వ భూములు ఉన్న పంచాయతీల్లో అర్హులకు ఇండ్ల స్థలం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. రైతులకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. వైద్యాధికారి పనితీరుపై ఎమ్మెల్యే మండిపడ్డారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేఘమాల, మండల ప్రత్యేకాధికారి సుధారాణి, ఎంపీడీవో పాండు, తహసీల్దార్ రమాదేవి, ఎంపీటీసీలు సురేందర్, అరిఫ్, సల్మాబేగం, నాగమణి, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కొడంగల్, మే 24 : వరి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పాయిపల్లిలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని, ఎప్పటికప్పుడు ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్న క్రమంలో రైతులకు ఇబ్బందుల కలిగించకుండా వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.

దంపతులకు డాక్టరేట్

తాండూరు, మే 24: తాండూరు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు యాదగిరి, అధ్యాపకురాలు శ్రీలక్ష్మి దంపతులు డాక్టరేట్ సాధించారు. తాండూరు ప్రభుత్వ నంబర్-1 ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న యాదగిరి తెలుగు విభా గంలో 'భండారు సదాశివరావు సాహిత్యం-సమగ్ర పరిశీలనం' అనే అంశంపై రీసెర్చ్‌ను కంప్లీట్ చేసి డాక్టరేట్‌ను సాధించాడు. అదే విధంగా శ్రీలక్ష్మి చరిత్ర విభాగంలో 'ది రోల్ ఆఫ్ దళిత్ విమెన్-సోషల్ రిఫార్మ్స్, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ ఆండ్ తెలంగాణ మూవ్‌మెంట్' అనే అంశంపై రీసెర్చ్‌ను కంప్లీట్ చేసి డాక్టరేట్‌ను సాధించింది. ఈ సందర్భంగా యాదగిరి, శ్రీలక్ష్మి దంపతులను తాండూరు నియోజక వర్గంలోని పలువురు అభినందనలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏసీపీని కస్టడీకి కోరుతూ

పిటిషన్ దాఖలు

నాంపల్లి కోర్టులు, మే 24 (నమస్తే తెలంగాణ): సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్)లో ఏసీబీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న టి.శ్రీరామ ఉమామహేశ్వర్‌రావును 10 రోజుల కస్టడీకి అప్పగించాలని కోరుతూ ఏసీబీ కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) శుక్రవారం పిటిషన్‌ను దాఖలు చేశారు. అతిముఖ్యమైన విచారణ మిగిలిపోయిందని, అరెస్టు సమయంలో నిందితుడు తమకు సరైన సమాధానాలు ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అధికారుల విచారణకు నిందితుడు సహకరించలేదని వివరించారు. సంపాదనకు మించిన ఆస్తులను కూడబెట్టిన వివరాలను తెలుసుకునేందుకు అప్పట్లో సమయం సరిపోలేదని తెలిపారు. ఇంకా చాలా ఆస్తులు ఆయన పేరిట, తన కుటుంబ సభ్యులు, బినామీల పేరుతో ఉన్నట్టు ప్రాథమికంగా సమాచారం ఉన్నదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని నివాసంలో జరిగిన సోదాల్లో లభ్యమైన స్థిర, చరాస్తులకు సంబంధించిన ఒరిజినల్ డ్యాక్యుమెంట్ల గురించి నిందితుడి నుంచి వివరాలు సేకరించాల్సి ఉన్నదని వివరించారు. ఇంకా కొన్ని ఆస్తుల వివరాలను నిందితుడు వివరించలేదని, ఒరిజినల్ డాక్యుమెంట్ల గురించి ఆయన వాంగ్మూలం ఈ కేసుకు కీలకమన్నారు. నిందితుడి ఇంటిలో జప్తు చేసిన ల్యాప్‌టాప్‌తో పాటు డైరీ, ఇతర పత్రాల గురించి వెల్లడించేందుకు ఆయన నిరాకరించాడన్నారు. వ్యవసాయ భూములు, ప్లాట్ల కొనుగోలు విషయంలో ఎవరితో లావాదేవీలు జరిపిన అంశాలన్నింటినీ నిందితుడి ద్వారా తెలుసుకోవాల్సి ఉన్నదని, ఈ కేసుకు వాటి సాక్ష్యాధారాలు కీలకమని పేర్కొన్నారు. ఎవరెవరితో నిందితుడు వ్యాపార లావాదేవీలను నడిపించారని, బహుమతుల రూపంలో ఎంత డబ్బులను పొందారన్న వివరాలను తెలుసుకోవాలని కోరారు. నిందితుడి తరఫు న్యాయవాదికి నోటీసులు జారీ చేయాలని ఏసీబీ కోర్టు జడ్జి అఫ్రోజ్ అక్తర్ ఆదేశాలు జారీ చేస్తూ సోమవారానికి విచారణను వాయిదా వేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ రుద్రమూర్తి

కొడంగల్, మే 24: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి హెచ్చరించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పలు ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు విక్రయిస్తే తప్పకుండా రసీదు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకొంటామన్నారు. ఈ-పాస్ ద్వారా పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. దుకాణదారులు ఈ-పాస్ ద్వారానే ఎరువులను విక్రయించాలని తెలిపారు. ఇందుకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. ఆయన వెంట ఏవో లావణ్య ఉన్నారు.

నర్సరీల్లో మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

కలుపు మొక్కలు తొలగిస్తున్న ఉపాధి హామీ కూలీలు

ధారూరు, మే 24 : మండల పరిధిలోని నర్సరీల్లో మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మనూర్ నర్సరీలో మొక్కల మధ్య పెరిగిన కలుపును ఉపాధి హామీ కూలీలు తొలగించారు. నర్సరీలలోని మొక్కలకు రెండు పూటలు నీరు అందించాలని ఆయా గ్రామ కార్యదర్శులు కూలీలకు తెలిపారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ ప్రత్యేక అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో పనులు చేయిస్తున్నారు.

మనీ సర్క్యూలేషన్ స్కీమ్ పేరుతో మోసం

బంజారాహిల్స్,మే 24: మనీ సర్క్యూలేషన్ స్కీమ్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయంటూ నమ్మించి మోసం చేసిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరిలో నివాసి బంగి రవికుమార్ ప్రభుత్వ ఉద్యోగి. రెండేండ్ల కిందట అతడికి ఇందిరానగర్‌కు చెందిన కొండా రవి పరిచయమయ్యాడు. తాము కనకలక్ష్మి సేవింగ్స్ పేరుతో మనీ సర్క్యూలేషన్ స్కీమ్ పెట్టామని, నెలకు రూ.2 వేలు చెల్లిస్తే లాభాలు వస్తాయని, మధ్యలో లక్కీ డ్రా ద్వారా బహుమతులు కూడా వస్తాయని నమ్మించాడు. దీంతో 22 నెలల పాటు డబ్బులు కట్టిన తర్వాత కొండా రవి బిచాణా ఎత్తేశాడు. ఇటీవల ఈ విషయం తెలుసుకున్న బాధితుడు తాను మోసపోయినట్లు గ్రహించి.. బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 420తో పాటు సెక్షన్ 3,4 ఆఫ్ ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యూలేషన్ స్కీమ్స్ బ్యానింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డిన్నర్ చేసి వచ్చేసరికి ఆభరణాలు మాయం

బంజారాహిల్స్, మే 24: రెస్టారెంట్‌లో డిన్నర్ చేసి వచ్చేసరికి కారులో పెట్టిన ఆభరణాలు మాయమయ్యాయి. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎమ్మెల్యే కాలనీకి చెందిన జైద్ అహ్మద్ వ్యాపారి. ఈ నెల 22న రాత్రి 9.15 గంటల సమయంలో బంజారాహిల్స్ రోడ్ నం.12లోని సెవెన్ సిస్టర్స్ రెస్టారెంట్‌లో డిన్నర్ కోసం భార్యతో కలిసి వచ్చాడు. కారును వ్యాలెట్ డ్రైవర్‌కు ఇచ్చిన జైద్ అహ్మద్.. గంట తర్వాత డిన్నర్ ముగించుకుని బయటకు వచ్చారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో డ్యాష్ బోర్డులో దాచిన ఏడు గ్రాముల బంగారం బ్రాస్‌లెట్, 4 గ్రాముల ఉంగరం కనిపించలేదు. కారును పార్క్ చేసిన వ్యాలెట్ డ్రైవర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ శుక్రవారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఐపీసీ 379 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పోలేపల్లి ఎల్లమ్మ హుండీ ఆదాయం రూ.5.67 లక్షలు

బొంరాస్‌పేట, మే 24 : దుద్యాల మండలం పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం హుండీ ద్వారా రూ.5.67 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్చిలో ఎల్లమ్మ జాతర ఉత్సవాలు ముగిసిన తరువాత నుంచి శుక్రవారం వరకు వచ్చిన హుండీ ఆదాయాన్ని దేవాలయ ప్రాంగణంలో లెక్కించారు. రెండు నెలల్లోనే రూ.5,67,108ల ఆదాయం వచ్చినట్లు దేవాలయం మేనేజర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవాలయం మేనేజర్ ఏదుల జయరాం, ఈవో నరేందర్, దేవస్థానం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువతి మృతి

పరిగి, మే 24: వైద్యం వికటించి యువతి మృతి చెందింది. ఈ మేరకు యువతి తండ్రి రుక్మద్దీన్ పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దోమ మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి రుక్మద్దీన్ చిన్న కూతురు యాస్మిన్ బేగం(22) రెండు రోజులుగా జ్వరంతో బాధపడు తుండడంతో ఈనెల 22వ తేదీ మధ్యాహ్నం సమయంలో పరిగిలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కి తీసుకువెళ్లి డాక్టర్ కు చూయించారు. ఆయన రాసిచ్చిన మందులను 22, 23 తేదీల్లో ఓ ఆర్ఎంపీ దగ్గరికి తీసుకువెళ్లి డాక్టర్‌తో మాట్లాడి యాస్మిన్‌కు వేశారు. 23 వ తేదీన యాస్మిన్ అకస్మాత్తుగా వణకడం ప్రారంభించింది. వెంటనే పరిగిలోని మరో ప్రైవేట్ హాస్పిటల్లో రాత్రి 9.30 గంటల ప్రాంతంలో యాస్మిన్ బేగంను అడ్మిట్ చేశారు. అక్కడ డాక్టర్ రాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం వరకు యాస్మిన్ కు చికిత్స నిమిత్తం వేర్వేరు మందులు ఇవ్వడంతో పాటు గ్లూకోస్ ఎక్కించారు. దీంతో 24వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటలకు యాస్మిన్ వెక్కిళ్లు పెట్టుకుంటూ అపస్మారక స్థితిలోకి వెళ్లగా అక్కడే ఉన్న వ్యక్తి వెంటనే వెళ్లి డాక్టర్‌కు తెలియజేయగా డాక్టర్ వచ్చి సీపీఆర్ నిర్వహించారు.

యువతిలో ఎలాంటి కదలిక రాకపో వడంతో సమస్య తీవ్రంగా ఉందని చెప్పి హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో గల రెయిన్ బో ఆసుపత్రికి తీసుకువెళ్లాలని డాక్టర్ రెఫర్ చేశారు. అప్పటికే యాస్మిన్ శరీరంపై దద్దుర్లు, మచ్చలు ఏర్పడ్డాయి. కుటుంబ సభ్యులు యాస్మిన్‌ను లంగర్‌హౌస్‌లోని రెయిన్ బో ఆసుపత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్లు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు తన కూతురు మరణంపై అను మానం ఉందని, తన కూతురు మరణానికి కారణం తెలుసుకొని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా యాస్మిన్ తండ్రి రుక్మద్దీన్ పరిగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పరిగి ఎస్ఐ సంతోష్ తెలిపారు.

నర్సరీల్లో మొక్కలను సంరక్షించాలి

అత్తాపూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో అజయ్‌కుమార్

నవాబుపేట, మే 24 : నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను సంరక్షించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అజయ్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కూలీలకు పలు సూచనలు చేశారు. వేసవిలో కూలీలు పని చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఎంఈవో గోపాల్ ఉన్నారు.

జీవాలు, పశువులకు టీకాలు తప్పనిసరి

పశువులకు టీకా వేస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, ఏడీ నోవా

కొడంగల్, మే 24 : జీవాలు, పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఏడీ నోవా తెలిపారు. శుక్రవారం ఎంపీపీ దేశ్‌ముఖ్ ద్వారా మున్సిపల్ పరిధిలో జీవాలు, పశువులకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువుల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 22 నుంచి 31 వరకు జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని తెలిపారు. అలాగే గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు ఇస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మర్పల్లి, మే 24 : మండల పరిధిలోని సిరిపురంలో రెండు రోజుల నుంచి భద్రకాళి వీరభద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజలు చేశారు. అగ్నిగుండం, స్వామి వారికి అభిషేకం, కల్యాణం, రథోత్సవం నిర్వహించినట్లు పూజారి కాశీనాథ్ స్వామి తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

తాండూరు రూరల్, మే 24: తాండూరు మండలం, కొత్లాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి . ఉత్సవాలు నెల రోజుల పాటు కొనసాగుతాయి. ఈ ఉత్స వాలను తిలకించేందుకు కర్ణా టక, మహారాష్ట్ర, ఆంధ్ర, తెలంగాణాలోని పలు జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చు కుంటారు. ఈ జాతరకు నూతన వధూవరులు వచ్చి అమ్మవారి ఆశీర్వాదం పొందుతారు. అమ్మవారికి ముక్కు పుడక, చీర సారే సమర్పిస్తారు. భక్తులకు ఇబ్బం దులు కలుగకుండా తాగునీరు, పార్కింగ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఈవో శేఖర్‌గౌడ్ తెలిపారు. ప్రత్యేక వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

యువతి ముసుగులో.. యువకులకు గాలం

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో అమ్మాయిల ముసుగులో యువకులకు గాలం వేసి, లక్షల రూపాయలు కుచ్చుటోపి పెడుతున్నారు. సైబర్‌క్రైమ్ ఏసీపీ రవీందర్ రెడ్డి కథనం ప్రకారం.. మారం అశోక్‌రెడ్డి(23) సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో 'స్నాప్‌చాట్' వంటి సోషల్ మీడియాలోని యాప్‌లలో యువతుల పేరుతో నకిలీ ఐడీలు సృష్టించాడు. యువతుల పేరుతో యువకులను ఆకర్శించి, ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించాడు. అనంతరం వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి మోసగించాడు. ఈ క్రమంలోనే నిందితుడు స్నాప్‌చాట్‌లో ప్రణితారెడ్డి పేరుతో యువతి ఫొటో పెట్టి నకిలీ ఐడీ సృష్టించాడు. ఈ ఐడీకి వచ్చిన పలు రిక్వెస్టులకు స్పందించిన ప్రణీతారెడ్డి అలియాస్ అశోక్‌రెడ్డి ప్రేమ, పెళ్లి వంటి మాయమాటలతో వారిని ఆకర్శించాడు. ఇది నమ్మిన యువకులు తమతో చాట్ చేస్తున్నది యువతిగా భావించి వారి మాటలను పూర్తిగా నమ్మేశారు. దీనిని ఆసరాగా చేసుకున్న నిందితుడు.. నేను చాలా ఇబ్బందుల్లో ఉన్నానని, తనను ఎలాగైనా ఆదుకోవాలంటూ బాధిత యువకులను వేడుకున్నట్లు నటిస్తాడు. అది నమ్మిన యువకులు వేలు, లక్షల రూపాయలను నిందితుడు సూచించిన అకౌంట్లకు బదిలీ చేస్తారు. ఈ క్రమంలోనే నగరానికి చెందిన ఒక బాధితుడు పెద్దమొత్తంలో నగదును ఆన్‌లైన్ ద్వారా నిందితుడు సూచించిన ఖాతాకు బదిలీ చేశాడు. అనంతరం ఎంతకీ యువతి అందుబాటులోకి రాకపోగా.. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన బాధితుడు సదరు యువతిపై ఆరాతీయగా ప్రణితారెడ్డి ముసుగులో ఉన్నది అమ్మాయి కాదు.. అబ్బాయని తెలుసుకుని షాక్ అయ్యాడు. వెంటనే సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా మోసగించిన డబ్బుతో గేమింగ్, బెట్టింగ్ ఆడినట్టు అంగీకరించాడు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

రూ.14 లక్షలు టోకరా.. నిందితుడి అరెస్టు

ఎలక్షన్ సెల్ సిబ్బందిని అభినందించిన సీపీ

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన రాచకొండ ఎన్నికల సెల్ అధికారులు, సిబ్బందిని శుక్రవారం రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అభినందించి, వారికి రివార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో ఎన్నికల సెల్ సిబ్బందితో మాట్లాడుతూ.. రాచకొండ పోలీసుల పనితీరును డీజీపీ ఆఫీస్‌తో పాటు ఎన్నికల పరిశీలకులు ప్రశంసించినట్లు తెలిపారు. నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికలు ము గిసే వరకు ఎలక్షన్ సెల్ పాత్ర ఎంతో కీలకమని, ఆ విషయాన్ని గుర్తించి అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేశారని సీపీ కొనియాడారు. ఎన్నికల నిర్వహణ అనేది ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, క్షేత్ర స్థాయిలో బందోబస్తు విధులు నిర్వర్తిస్తున్న అన్ని విభాగాల పోలీసు సిబ్బందికి ఎలక్షన్ సెల్ మార్గనిర్దేశం చేసిందన్నారు.

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల నేపథ్యంలో..భువనగిరి జోన్‌లో ఆంక్షలు

సిటీబ్యూరో, మే 24 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సందర్భంగా యదాద్రి- భువనగిరి జిల్లాలో ఈనెల 25వ తేదీ 4 గంటల నుంచి 27వ తేదీ 4 గంటలకు వరకు మద్యం దుకాణాలు మూసివేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి తెలిపారు.ఈ నెల 27న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల నియోజక వర్గం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరుగనున్నది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని భువనగిరి జోన్‌లో ఈ ఆంక్షలు అమలులో ఉంటాయి.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింట్ M/s శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్ నారాయణపేట బ్రాంచ్ వారు Mudavath Sevya Nayak S/o Gangya Nayak, age 55 years, Occ: Business, R/o H.No.3-79, Bodabanda Thanda, Namdarpur Vil., Bomraspet Mandal, Narayanpet Dist., **Applicant / Borrower,** Smt. Mudavath Sakri Bai W/o Mudavath Sevya Naik, age 54 years, Occ: Business, R/o H.No.3-79, Bodabanda Thanda, Namdarpur Vil., Bomraspet Mandal, Narayanpet Dist., **Co-Borrower/Prop. Holders** గారికి ఇచ్చు వ్యాపార లోన్ వ్యవహారాలలో తమ సొంత ఆస్తిని తనఖా పెట్టుటకు అంగీకరించినారు. కావున ఇట్టి ఆస్తిపై ఎవరికైనా అభ్యంతరాలు మరియు క్లెయిములు ఉన్నయెడల ఈ తేది నుండి 3 రోజులలో మా ఆఫీస్‌లో గాని లేదా మా క్లయింట్ ఆఫీస్‌లో గాని సంప్రదించగలరు.

SCHEDULE OF THE PROPERTY

Residential house bearing No.5-38, (assessment No.446) constructed in residential plot admeasuring 302.22 Sq.Yrds., plinth area 1320 SFT., situated in Medichettu Thanda, Namdarpur Vil., Bomraspet Mandal, Vikarabad Dist., which is bounded as under: **East:** House of Vittal Nayak, **West:** House of Ramulu Nayak, **North:** Road, Land of Sevya Nayak, **South:** House of Somla Nayak.

MALLIKARJUN B.A, LL.B.,
Advocate, 1-6-41/12, Satya Sai Colony, Narayanpet. Cell: 9440393742